
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

బుధవారం, 1, మే, 2024



సోమశిలలో 8.187 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో మంగళవారం నాటికి 8.187 టీఎంసీలు ఉన్నాయి. డెల్టాకు 200, ఉత్తరకాలువకు 5, దక్షిణకాలువకు 5 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.74,140
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.6,622
మూడు శాతం జీఎస్టీతో	రూ.6,821
నవర (8 గ్రాములు)	రూ.54,568



ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌పై బాబు దుష్ప్రచారం

పొదలకూరు: ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌పై చంద్రబాబు దుష్ప్రచారం చేస్తున్నారని మంత్రి కాకాణి పేర్కొన్నారు. 8లో

న్యూస్‌రీల్

నవీన కవితా ఉద్యమానికి ఆద్యుడు శ్రీశ్రీ



శ్రీశ్రీ చిత్రపటం వద్ద నివాళులర్పించిన రచయితలు

నెల్లూరు(బృందావనం): మహాకవి శ్రీశ్రీ జయంతిని నెల్లూరు రచయితల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. మాగుంట లేఅవుట్‌లోని సంఘ కార్యాలయంలో శ్రీశ్రీ చిత్రపటానికి రచయితలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ నవీన కవితా ఉద్యమానికి ఆద్యుడు శ్రీశ్రీ అని శ్లాఘించారు. శ్రీశ్రీని తెలుగు సాహిత్య ప్రపంచం ఎన్నటికీ మరచిపోదన్నారు. సమాజంపై అవగాహనతో ఆయన రాసిన కవిత్వం ఎందరికో స్ఫూర్తిదాయకమన్నారు. జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు జయప్రకాష్, మాటేటి రత్నప్రసాద్, శ్రీమన్నారాయణ, అరుణ, నజ్మా, భారతి పాల్గొన్నారు.

బస్సు దగ్ధం



మనుబోలు: మండలంలోని వీరంపల్లికి చెందిన ప్రైవేట్ బస్సు ప్రమాదవశాత్తు దగ్ధమైంది. వివరాలు..వీరంపల్లికి చెందిన యనమల వాసు ప్రైవేట్ బస్సు నడుపుకొంటూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం రాత్రి నెల్లూరులో ప్రయాణికులను దించేసి తిరిగి స్వగ్రామానికి బయలుదేరాడు. వెంకటాచలం మండలం ఇస్లాంపేట వద్దకు రాగానే విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ఒక్కసారిగా బస్సులో మంటలు చెలరేగాయి. దీంతో వాసు బస్సులో నుంచి కిందకు దూకేశాడు. ఈ క్రమంలో కాలికి తీవ్ర గాయాలయ్యాయి. బస్సు పూర్తిగా కాలిపోవడంతో సుమారు రూ.15 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు.

నెల్లూరు అభివృద్ధికి సిద్ధం



మేనిఫెస్టోను విడుదల చేస్తున్న విజయసాయిరెడ్డి, ఆదాల, బీద, పర్వతరెడ్డి, హఫీజ్‌ఖాన్, తదితరులు

- 46 హామీలతో ప్రత్యేక మేనిఫెస్టో విడుదల
- నెల్లూరు ఎంపీతో పాటు ఏడు అసెంబ్లీ స్థానాల్లో వైఎస్సార్‌సీపీదే విజయం
- ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి

నెల్లూరు(దర్గామిట్ట): నెల్లూరు సమగ్రాభివృద్ధికి ప్రత్యేకంగా మేనిఫెస్టోను రూపొందించామని వైఎస్సార్‌సీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డి తెలిపారు. మాగుంటలేఅవుట్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో నెల్లూరు పార్లమెంట్ పరిధిలోని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థులు, పార్టీ జిల్లా అధ్యక్షుడు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, తదితరులతో కలిసి ఆయన మంగళవారం రాత్రి మేనిఫెస్టోను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మేనిఫెస్టోలోని అంశాలను డిజిటల్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం త్రీడీ చిత్రాలను ప్రదర్శిస్తూ 2029లో నెల్లూరు ఏ విధంగా ఉంటుందో చూపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో 99 శాతం నెరవేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. ఆయన ఆశీర్వాదంతో మేనిఫెస్టోలో పొందుపరిచిన అంశాలను తప్పక నెరవేరుస్తామని హామీ ఇచ్చారు. నెల్లూరు లోక్‌సభ స్థానంతో పాటు ఏడు అసెంబ్లీ స్థానాల్లో తమ పార్టీ విజయం తథ్యమన్నారు. కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్, రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు, రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి, మేయర్ పొట్లూరు స్రవంతి జయవర్ధన్, నుడా చైర్మన్ ముక్కాల ద్వారకనాథ్, ఏఎంసీ చైర్మన్ కోటేశ్వరరెడ్డి, నాయకులు ఆనం జయకుమార్‌రెడ్డి, మేకపాటి అభినవ్‌రెడ్డి, చెన్నారెడ్డి మనుక్రాంత్‌రెడ్డి, సన్నపురెడ్డి పెంచలరెడ్డి, జెడ్పీటీసీ మల్లు సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మేనిఫెస్టోలోని అంశాలు ..

- సోమశిల హైలెవల్ కెనాల్ నిర్మాణ పనుల పూర్తితో లక్ష ఎకరాలకు సాగు, 2.5 లక్షల మందికి తాగునీరు.
- రైతుల కోసం 40 గోదాముల నిర్మాణం.
- నెల్లూరులో టెక్ హబ్, స్టార్టప్ హబ్‌ల ద్వారా నాలుగు లక్షల మంది యువతకు ఉపాధి కల్పన.
- నెల్లూరులో ఐటీ పార్కు నిర్మాణం.
- మొగళ్లపాళెం వద్ద రూ.250 కోట్లతో 150 ఎకరాల్లో స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణం.
- ఆర్థిక స్తోమత లేని వంద మంది విద్యార్థులకు విదేశీ విద్యకు స్పాన్సర్డ్ స్టడీ స్కాలర్ షిప్‌లతో ప్రోత్సాహం.
- నెల్లూరు లోక్‌సభ పరిధిలో ప్రతి ఆరు నెలలకు ఒకసారి జాబ్ మేళా నిర్వహణ ద్వారా పది వేల మంది యువతకు ఉద్యోగావకాశాల కల్పన.
- బిట్రగుంటలోని 1800 ఎకరాల రైల్వే స్థలంలో మెగా ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు ద్వారా 30 వేల మందికి పైగా ఉపాధి కల్పన.
- నెల్లూరు లోక్‌సభ పరిధిలో వేయి మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుతో ఉపాధి కల్పన.
- ఆక్వా హేచరీస్‌ను 150కు పెంచడం ద్వారా 10 వేల మందికి ఉపాధి కల్పన.
- నెల్లూరు పరిసరాల్లో 30 వుడ్‌పల్ప్ కర్మాగారాల ఏర్పాటుతో పదివేల మందికి ఉపాధి కల్పన.
- మైపాడు బీచ్ పర్యాటకంగా అభివృద్ధి.
- నెల్లూరు చుట్టూ రింగ్ రోడ్ నిర్మాణం.
- నెల్లూరు లోక్ సభ పరిధిలో కార్గో హబ్‌తో కూడిన అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణం.
- మహిళల ఆరోగ్య సంరక్షణ మల్టీ హెల్త్‌చెకప్ క్యాంపులు. ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించే దిశగా బ్యాంకులు, ప్రభుత్వ పథకాల ద్వారా సులభమైన వడ్డీలేని రుణాలు మంజూరు.
- ఆత్మకూరులో రోడ్ల అభివృద్ధితో పాటు రూ.100 కోట్లతో తలపెట్టిన లిఫ్ట్‌ఇరిగేషన్ స్కీం పనుల పూర్తి.
- కావలి పట్టణం చుట్టూ రింగ్ రోడ్డు నిర్మాణం.
- రూ.88 కోట్ల వ్యయంతో ఇందుకూరుపేట మండలంలో పెన్నానదికి రిటైనింగ్ వాల్ నిర్మాణం. రూ.130 కోట్ల వ్యయంతో ముదివర్తి–ముదివర్తిపాళెం మధ్యన పెన్నానదిపై సబ్‌మెర్సిబుల్ కాజ్‌వే రెండో దశ నిర్మాణం. రూ.5 కోట్ల వ్యయంతో ఓగూరు దిగువ భాగంలో చెక్‌డ్యాం నిర్మాణం.
- కలిగిరి వద్ద ఉత్తర కాలువపై రూ.50 కోట్లతో లిఫ్ట్ ఇరిగేషన్ నిర్మాణంతో వింజమూరు చెరువుకు సాగునీరు. వింజమూరును మున్సిపాలిటీ స్థాయికి పెంపు.
- కందుకూరు–నరసింగోలు మార్గంలో పాలేరు నదిపై రూ.25కోట్లతో రోడ్డు, చెక్ డ్యాం నిర్మాణం. కందుకూరు – తెట్టు మధ్య మానేటిపై రూ.18 కోట్లతో హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం.
- నెల్లూరును క్లీన్ అండ్ గ్రీన్ సిటీగా మార్చడం.
- స్వర్ణాల చెరువు,నెల్లూరు ట్యాంకుల సుందరీకరణ.

మేనిఫెస్టోలో కావాలనే మోదీ ఫొటో తొలగింపు

నెల్లూరు(దర్గామిట్ట): టీడీపీ అధినేత చంద్రబాబు మేనిఫెస్టోలో ఉద్దేశ్యపూర్వకంగానే ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఫొటో లేకుండా చేశారని వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డి అన్నారు. రాష్ట్రంలో ముస్లింల ఓటు భయం బాబును వెంటాడుతుందన్నారు. అందుకోసమే కూటమి మేనిఫెస్టోలో మోదీ ఫొటోను మాయం చేశారన్నారు. బీజేపీ, జనసేన టీడీపీ కూటమిగా జతకట్టాయని, మేనిఫెస్టోలో మోదీ ఫొటో ఎందుకు పెట్టలేదో స్పష్టత ఇవ్వాలన్నారు. కేంద్రంలో బీజేపీ వస్తుందని, యూనిఫామ్ సివిల్ కోడ్ తెస్తే టీడీపీ సమర్థిస్తుందా అని సూటిగా ప్రశ్నించారు.

చంద్రబాబును నమ్మి మోసపోవద్దు



అన్నారెడ్డిపాలెంలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

- కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి

విడవలూరు: చంద్రబాబు ఎలాగైనా అధికారంలోకి రావాలని మరోమారు మోసపూరిత హామీలను గుప్పిస్తున్నారని, వాటిని నమ్మి ప్రజలు మోసపోవద్దని ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి సూచించారు. మండలంలోని పార్లపల్లి, అన్నారెడ్డిపాళెం, ముదివర్తి, ఊటుకూరు గ్రామాల్లో మంగళవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రసన్న మాట్లాడుతూ 2014 ఎన్నికల సమయంలో 600 హామీలు ఇచ్చిన చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయకుండా తుంగలోకి తొక్కాడని గుర్తుచేశారు. తన స్వలాభం కోసం ఎంతకైనా దిగజారి రాజకీయాలు చేసే వ్యక్తి చంద్రబాబు అన్నారు. ఇప్పుడు సూపర్ సిక్స్, సూపర్ సెవన్ అంటూ చంద్రబాబు ఇస్తున్నవి మోసపూరిత హామీలేనన్నారు. ఎస్సీ, ఎస్టీలను అవమానించిన వ్యక్తి చంద్రబాబు అని, గతంలో దళితులుగా ఎవరూ పుట్టాలని కోరుకోరు అని అవహేళన చేశారని గుర్తుచేశారు. ప్రజాసంకల్ప పాదయాత్ర ద్వారా ప్రతి పేదవాడి కష్టాన్ని దగ్గర నుంచి చూసిన జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక సంక్షేమ పథకాల ద్వారా పేద, మధ్యతరగతి ప్రజలకు ఆర్థిక భరోసా కల్పించారని తెలిపారు. ఎస్సీ,ఎస్టీల మీద ప్రేమతో 200 యూనిట్ల వరకు ఉచిత కరెంట్‌ను ప్రకటించారన్నారు. పార్లపల్లి గ్రామానికి రూ.17.96 కోట్లు, ముదివర్తి గ్రామానికి రూ.24.85 లక్షలను డీబీటీ, నాన్ డీబీటీ కార్యక్రమాల ద్వారా అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌దేనన్నారు. ఇంత మంచి చేసిన జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు అండగా నిలిచి మరోమారు ముఖ్యమంత్రిగా ఎన్నుకోవాలని కోరారు. రాబోయే ఎన్నికల్లో కోవూరు ఎమ్మెల్యేగా తనను, నెల్లూరు ఎంపీగా వేణుంబాక విజయసాయిరెడ్డిని ఫ్యాన్‌గుర్తుపై ఓటేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పూండ్ల అచ్యుత్‌రెడ్డి, జెడ్పీటీసీ తుమ్మల లక్ష్మయ్య, పార్టీ మండల గౌరవాధ్యక్షుడు కాటంరెడ్డి నవీన్‌రెడ్డి, నాయకులు కొండూరు వెంకటసుబ్బారెడ్డి, కొండూరు లక్ష్మీనారాయణరెడ్డి, బండ్ల గోవర్ధన్, బండ్ల కవిత, ఉప్పాల శివ, మోర్ల మల్లికార్జున పాల్గొన్నారు.

గురుకులాల్లో సీట్ల భర్తీకి దరఖాస్తులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 2024–25 విద్యా సంవత్సరానికి గాను 3వ తరగతి నుంచి 9వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేయనున్నట్లు జిల్లా ఐటీడీఏ(యానాదులు)పీడీ డాక్టర్ రాణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు మే ఒకటో తేదీ నుంచి 20వ తేదీ వరకు సంబంధిత పాఠశాలల్లో దరఖాస్తులు అందజేయవచ్చని చెప్పారు. మే 30న ఐటీడీఏ పీడీ కార్యాలయంలో లాటరీ ద్వారా సీట్ల భర్తీకి విద్యార్థులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.

పోలింగ్ శాతం పెంపునకు చర్యలు

- ఎన్నికల నిబంధనలను అందరూ పాటించాలి
- పార్లమెంట్‌కు 14, అసెంబ్లీకి 115 మంది పోటీ
- 13న ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్
- పోస్టల్ బ్యాలెట్ వినియోగానికి ఫెసిలిటేషన్ సెంటర్లు
- జిల్లా ఎన్నికల అధికారి హరినారాయణన్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు(పొగతోట): జిల్లాలో పోలింగ్ శాతాన్ని పెంచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం హరినారాయణన్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మీడియా సెంటర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ఓటర్లు ప్రశాంత వాతావరణంలో స్వేచ్ఛగా, పారదర్శకంగా ఓటు వినియోగించుకునేలా నిబంధనలు అమలు చేస్తున్నామన్నారు. జిల్లా యంత్రాంగానికి అభ్యర్థులందరూ సహకరించాలని కోరారు. నెల్లూరు పార్లమెంట్‌కు 14 మంది, 8 అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి 115 మంది పోటీలో ఉన్నారని తెలిపారు. ఈ నెల 13న ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరుగుతుందన్నారు. పోలింగ్ రోజును సెలవు దినంగా ప్రకటించామన్నారు. పోలింగ్‌కు 48 గంటల ముందు ఎన్నికల ప్రచారాన్ని ముగించాల్సి ఉంటుందన్నారు. పోలింగ్‌కు 48 గంటల ముందు నుంచి బార్లు, రిటైల్ దుకాణాలు మూసివేస్తామన్నారు. ఈ నెల 2 నుంచి ఓటరు స్లిప్‌లు పంపిణీ చేస్తామన్నారు. పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించి 19 వేల ఫారం–12 దరఖాస్తులను అందజేశామని, అందుకోసం ప్రత్యేకంగా ఫెసిలిటేషన్ సెంటర్లు ఏర్పాటు చేశామని వివరించారు. ఈ నెల నెల 5 నుంచి 7వ తేదీ వరకు పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవచ్చని తెలిపారు. 1712 మంది వృద్ధులు, దివ్యాంగులు ఫారం–12డీలను అందజేశారని చెప్పారు. వారు ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకు తొలి విడత, 8 నుంచి 10వ తేదీ వరకు రెండో విడతగా ఇంటి వద్దే ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు చేపట్టామని తెలిపారు. ఎస్పీ ఆరిఫ్‌హఫీజ్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటి వరకు రూ.2.51 కోట్లు నగదు, రూ 26.50 లక్షల విలువ చేసే మద్యాన్ని సీజ్ చేశామని తెలిపారు. జిల్లాలో 3 బీఎస్ఎఫ్, 4 స్పెషల్ ఆర్మ్‌డ్ ఫోర్స్ బృందాలతో పోలింగ్, ఓట్ల లెక్కింపు సమయాల్లో గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. 982 మంది రౌడీషీటర్లను బైండోవర్ చేశామని వెల్లడించారు. జిల్లాలో ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు చేపట్టామని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా సమాచార పౌరసంబంధాల అధికారి సదారావు, డీపీఆర్వో మోహన్‌రాజు, ఇంజినీర్ కిషోర్ పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోండి

నెల్లూరు(దర్గామిట్ట): ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్లలో వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి హరినారాయణన్ సూచించారు. కందుకూరులోని ఓవీ రోడ్డు జెడ్పీ హైస్కూల్‌లో 3, కావలిలోని బాలుర జెడ్పీ హైస్కూల్‌లో 5, ఆత్మకూరులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 6, కోవూరులోని పీఆర్ఎన్ జెడ్పీ హైస్కూల్‌లో 3, నెల్లూరు సిటీకి డీకేడబ్ల్యూ కళాశాలలో 5, నెల్లూరురూరల్‌కు క్యూబా ఇంజినీరింగ్ కళాశాలలో 4, ఇతర జిల్లాల వారికి దర్గామిట్ట జెడ్పీ బాలుర హైస్కూల్‌లో 8 కౌంటర్లు ఏర్పాటు చేశామని తెలిపారు. మరింత సమాచారం కోసం డీఐఓ వెబ్ సైట్ లేదా 0861– 2331999, 2324374, 2331626, 2325025, 2331235, 2325025 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

భలే మంచి కండువా బేరం

కోవూరు: ఎన్నికల వేళ రాజకీయ పార్టీల అభ్యర్థులు తమ బలాలను చాటుకునేందుకు ప్రతిపక్ష పార్టీల నాయకులు, కార్యకర్తలను ఆకర్షిస్తుంటారు. ప్రలోభాలతో తమ పార్టీలో చేర్చుకుంటుంటారు. ఇదే అదనుగా కొందరు జంపింగ్ జిలానీలు నిత్యం కండువాలు మార్చేస్తున్నారు. ఈ రోజు ఓ పార్టీలో చేరి కండువా వేసుకుంటే, మరుసటిరోజు మరో పార్టీలో చేరి కండువా వేసుకోవడం కోవూరు నియోజకవర్గంలో ఫ్యాషన్‌గా మారింది. మరోవైపు కండువాలను వేయించే స్పెషలిస్టులు సైతం ఇక్కడ పుట్టుకొచ్చారు. వీరు ఎన్నికల్లో పోటీ చేసే రాజకీయ పార్టీల అభ్యర్థుల వద్దకు వెళ్లడం..తాము ఫలానా వాడిని పట్టేశామని, అతను మన పార్టీలోకి రావడానికి సిద్ధంగా ఉన్నాడని, అతనికి ఎక్కువగా ఓట్లున్నాయని నమ్మిస్తారు. వీరి మాటలు నమ్మిన నేత అతనికి నిర్ణయించిన ప్యాకేజీ అందజేయగానే స్పెషలిస్టులు రంగంలోకి దిగుతారు. జంపింగ్ జిలానీలను మునగచెట్టు ఎక్కించి పార్టీలో చేర్పించి సోషల్ మీడియాలో వీడియో, ఫొటోలను వైరల్ చేస్తారు. అంతటితో ఆగక కొత్తగా కండువా కప్పుకున్న వ్యక్తికి పార్టీ నాయకుడు ఇచ్చిన డబ్బును దాబాల్లో ఖాళీ చేయించే దాకా వదలరు. పార్టీ ఫిరాయించిన సదరు వ్యక్తి ఉదయం లేచి తనకు బాగా కావాల్సిన వాళ్ల దగ్గరకు వెళ్లి తన గోడును వెళ్ల బోసుకోగా మరో బ్యాచ్ రంగంలోకి దిగుతుంది. అతన్ని శాంతింపజేసి తిరిగి సొంత గూటికి చేర్చడం రివాజుగా మారింది. ఇలాంటి జంపింగ్ జిలానీలను సామాజికవర్గాల వారీగా వంద మంది వరకు టీడీపీ ద్వితీయశ్రేణి నాయకులు సిద్ధం చేసుకున్నట్లు సమాచారం. ఈ పరిస్థితిని చూసిన జనం భలే మంచి కండువా బేరం అంటూ నవ్వుకుంటున్నారు.


ఏఎస్‌పేట మండలంలో మాట్లాడుతున్న నేహారెడ్డి


వృద్ధురాలు చెబుతోంది వింటున్న అభినవ్‌రెడ్డి


కరపత్రం అందజేస్తున్న సాకేత్‌రెడ్డి, మహిమారెడ్డి


ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరుతున్న రజత్‌కుమార్‌రెడ్డి

మీ సేవకై..

వైఎస్సార్‌సీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డి భార్య సునందారెడ్డి, కుమార్తె నేహారెడ్డి, ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి తల్లి మణిమంజరి మంగళవారం ఏఎస్‌పేట మండలంలోని గుంపర్లపాడు, మదారాబాద్, శ్రీకొలను గ్రామాల్లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఉదయగిరి ఎమ్మెల్యేగా మేకపాటి రాజగోపాల్ రెడ్డిని గెలిపించాలని కోరుతూ ఆయన తనయుడు అభినవ్‌రెడ్డి సీతారామపురంలో ఇంటింటి ప్రచారం చేశారు. కావలిఎమ్మెల్యేగా రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ ఆయన తనయుడు బాలసాకేత్‌రెడ్డి, కోడలు మహిమారెడ్డి పట్టణంలో స్థానిక నాయకులతో కలిసి కరపత్రాలు పంపిణీ చేశారు. కోవూరు ఎమ్మెల్యేగా నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ ఆయన తనయుడు, యువజన విభాగం కోవూరు నియోజకవర్గ అధ్యక్షుడు నల్లపరెడ్డి రజత్ కుమార్‌రెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

– అనుమసముద్రంపేట/కావలి/సీతారామపురం/ఇందుకూరుపేట

ప్రచార పర్వం

క్లుప్తంగా

పాతకక్షల నేపథ్యంలోనే యువకుడి హత్య

• ముగ్గురు నిందితుల అరెస్ట్


నిందితుల వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరెడ్డి

నెల్లూరు(క్రైమ్): నెల్లూరులోని ఆటోనగర్‌లో ఇటీవల దారుణ హత్య కేసులోని నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. వేదాయపాళెం పోలీస్ స్టేషన్‌లో మంగళవారం నగర డీఎస్పీ డి.శ్రీనివాసరెడ్డి స్థానిక ఇన్‌స్పెక్టర్ పీవీ నారాయణతో కలిసి హత్యకు దారి తీసిన పరిస్థితులు, నిందితుల వివరాలను వెల్లడించారు. బీవీ నగర్ రైల్వే గేట్ వినాయకగుడి వీధిలో పి.దశరథ (28) నివాసం ఉండేవాడు. అతనికి పాత వేదాయపాళెం జనశక్తినగర్‌కు చెందిన జి.రవి అలియాస్ కత్తి రవితో గొడవలున్నాయి. 2016లో దశరథపై రవి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. అప్పట్లో దశరథ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. దీంతో రవి కక్ష పెంచుకున్నాడు. ఎలాగైనా అతడిని అంతమొందించాలని నిర్ణయించుకున్నాడు. గత నెల 22వ తేదీ రాత్రి సుమారు 11.30 గంటల ప్రాంతంలో రవి తన స్నేహితులైన జ్యోతినగర్‌కు చెందిన వి.వెంకటేష్ అలియాస్ వెంకీ, వీఎంఆర్ నగర్‌కు చెందిన షేక్ అమీర్‌బాషా అలియాస్ అమీర్‌తో కలిసి వేదాయపాళెంలోని ఓ బార్ సమీపంలో మద్యం తాగసాగారు. ఈ క్రమంలో దశరథ అటుగా వెళ్తుండటాన్ని గమనించిన నిందితులు అతడితో మాట్లాడాలని బైక్‌పై ఎక్కించుకుని ఆటోనగర్‌లోని అయ్యలరెడ్డి లేఅవుట్ ఖాళీ స్థలాల్లోకి తీసుకెళ్లారు. నిందితులు ఇనుపరాడ్‌తో దశరథపై దాడి చేసి కత్తితో పొడవడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. వాళ్లు పరారయ్యారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు ఇన్‌స్పెక్టర్ హత్య కేసు నమోదు చేశారు. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి సాంకేతికత ఆధారంగా నిందితులు రవి, వెంకటేష్, అమీర్‌బాషాగా గుర్తించి గాలింపు చర్యలు చేపట్టారు. కాగా వాళ్లు సోమవారం సాయంత్రం పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయారు. దీంతో మంగళవారం నిందితులను అరెస్ట్ చేసి హత్యకు వినియోగించిన ఇనుపరాడ్, పరారయ్యేందుకు ఉపయోగించిన బైక్‌ను స్వాధీనం చేసుకున్నామని డీఎస్పీ తెలిపారు. సమావేశంలో స్థానిక ఎస్సై శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్)	: 140
లేయర్ (లైవ్)	: 85
బ్రాయిలర్ చికెన్	: 248
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 278
లేయర్ చికెన్	: 145

పొదలకూరు నిమ్మధరలు (కిలో)



పెద్దవి	: రూ.92
సన్నవి	: రూ.60
పండ్లు	: రూ.40

ల్యాండ్ టైటిల్లింగ్ యాక్ట్‌పై బాబు దుష్ప్రచారం

• రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి


మహ్మదాపురంలో ప్రచారం చేస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు: ల్యాండ్ టైటిల్లింగ్ యాక్ట్‌పై చంద్రబాబు దుష్ప్రచారం చేస్తున్నాడని, ఆయనకు పచ్చ మీడియా వంత పాడుతోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి విమర్శించారు. మండలంలోని తోడేరు ఎస్సీ కాలనీ, రత్నగిరి, శాంతినగర్, మహ్మదాపురం, తాటిపర్తి, నల్లపాళెం, ఆనాటికండ్రిక, వరదాపురం గ్రామాల్లో మంగళవారం మంత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని రాష్ట్రాల్లో ల్యాండ్ టైటిల్లింగ్ యాక్ట్‌ను అమలు చేయాలని ఒత్తిడి చేస్తున్న బీజేపీతో చంద్రబాబు అంటకాగుతున్నట్లు చెప్పారు. యూనిఫాం సివిల్ కోడ్ విధానం అమలు చేస్తామని ప్రకటిస్తూ, ముస్లింలకు వరంగా మారిన నాలుగు శాతం రిజర్వేషన్లను రద్దు పరుస్తామని చెబుతున్నా వారిని ఎందుకు ప్రశ్నించడం లేదన్నారు. బాబు మైనారిటీల అభివృద్ధి నిరోధకుడిగా మారినట్లు విమర్శించారు. గతంలో ఇచ్చిన హామీలను ఒక్కటి కూడా అమలు చేయలేదని, ఇప్పుడు సూపర్ సిక్స్ పేరుతో మోసగించాలని చూస్తున్నట్లు చెప్పారు. కూటమి విడుదల చేసిన మేనిఫెస్టోకు ప్రజల నుంచి స్పందన లేదన్నారు.

సోమిరెడ్డి ఓటమి ఖాయం

టీడీపీ అభ్యర్థి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఓటమి ఖాయమైందని, మండుటెండలో సైతం ప్రజలు వైఎస్సార్‌సీపీ సభలకు బ్రహ్మరథం పడుతున్నట్లు కాకాణి వెల్లడించారు. సోమిరెడ్డి గెలిచిపోతున్నట్లు భ్రమల్లో ఉంటూ ప్రచారం చేస్తున్నారన్నారు. ప్రజలంతా వైఎస్సార్‌సీపీ వైపే ఉన్నారని, ఊహించని మెజారిటీతో తాను విజయం సాధిస్తానని వెల్లడించారు. కార్యక్రమంలో ఏనుగు శశిధర్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ గోగిరెడ్డి గోపాల్‌రెడ్డి, డొడ్ల డెయిరీ చైర్మన్ డొడ్ల శేషారెడ్డి, డొడ్ల సుబ్బారెడ్డి, కరిపరెడ్డి కృష్ణారెడ్డి, పి.లచ్చారెడ్డి, పి.పోలిరెడ్డి, నంది శ్రీనివాసులురెడ్డి, డి.మురళీకృష్ణారెడ్డి, డి.శ్రీనివాసులురెడ్డి, నువ్వుల మంజుల, అచ్చాల సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగన్‌ను రెండోసారి సీఎం చేసేందుకు కృషి చేయాలి

• వైఎస్ విమలారెడ్డి


మాట్లాడుతున్న విమలారెడ్డి

నెల్లూరు(బృందావనం): ప్రజలకు సంక్షేమ పథకాలు అందించి, రాష్ట్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధిపథంలోకి ముందుకు తీసుకెళ్లిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రెండోసారి ముఖ్యమంత్రిని చేసేందుకు క్రైస్తవ సంఘీయులు కృషి చేయాలని వైఎస్ విమలారెడ్డి కోరారు. నెల్లూరులోని ఓ హోటల్లో మంగళవారం జిల్లా క్రైస్తవ సమాఖ్య నేత రెవరెండ్ రాజశేఖర్ దాసరి అధ్యక్షతన నెల్లూరు క్రైస్తవ మేధావుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. పేదల సంక్షేమం కోసం వైఎస్ జగన్ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. సమావేశంలో రాష్ట్ర క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ జాన్‌వెస్లీ, సంఘ కాపరులు, పాస్టర్లు క్రాంతికుమార్, జోసెఫ్‌బాబు, జాన్సన్, స్వరాజ్, యాకోబు, దాసరి రాజేష్, సాల్మన్, బెన్‌హర్‌బాబు, విజయరత్నం, లూథర్ శామ్యూల్, స్టాన్లీ తదితరులు పాల్గొన్నారు. తొలుత జగన్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

రూరల్ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక

• వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఆదాల


ఎన్నికల ప్రచారం చేస్తున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు సిటీ: నెల్లూరు రూరల్ నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేశామని, ఎన్నికల అనంతరం తగిన చర్యలు తీసుకుంటామని వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. 19వ డివిజన్‌లో మంగళవారం రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను కేవలం ప్రజా సేవ కోసమే రాజకీయాల్లోకి వచ్చినట్లు చెప్పారు. పదవులను అడ్డం పెట్టుకుని సంపాదించాలనే ఆలోచన లేదన్నారు. నిత్యం అరాచకాలు సృష్టించే వ్యక్తి కావాలో, అభివృద్ధిని ఆకాంక్షిస్తూ ప్రజా శ్రేయస్సు కోసం పనిచేసే వ్యక్తి కావాలో ఆలోచించి ఓటు వేయాలని కోరారు. అసాంఘిక కార్యకలాపాలను తాను ఏనాడూ ప్రోత్సహించలేదని, వాటికి చాలా దూరంగా ఉంటానన్నారు. ప్రజలందరూ బాగుండాలనే కోరుకుంటానన్నారు. కార్యక్రమంలో మేయర్ స్రవంతి, నాయకులు మలిరెడ్డి కోటారెడ్డి, పచ్చ రవి, జల్లి కుమార్, వారాల లక్ష్మీనారాయణ, కొండేటి శివారెడ్డి, కొండేటి రఘురామ్‌రెడ్డి, స్వర్ణా వెంకయ్య, ముడియాల రామిరెడ్డి, పద్మాకర్, పి.మల్లి, శివ, ఎం.గిరి, కామేశ్వరమ్మ, అనితమ్మ, ఎం.విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక

ఆదాల ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో మాజీ కార్పొరేటర్ నెల్లూరు సునీత ఆమె భర్త, టీడీపీ సీనియర్ నాయకుడు నెల్లూరు శ్రీనివాసులునాయుడు వైఎస్సార్‌సీపీలో చేరారు. ఇంకా 19వ డివిజన్ రామలింగాపురం ఆటో యూనియన్ నాయకులు, మరో 10 కుటుంబాల వారు కూడా చేరారు. వారికి ఆదాల పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

తెలుగుదేశం నేతల మాటలు నమ్మొద్దు

• వైఎస్సార్‌సీపీ కందుకూరు అభ్యర్థి మధుసూదన్ యాదవ్


17వ వార్డులో కరపత్రం అందజేస్తున్న బుర్రా మధుసూదన్ యాదవ్

కందుకూరు: 'తెలుగుదేశం నేతల మాటలు ఎవరూ నమ్మొద్దు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలతో విప్లవాత్మక మార్పులు తెచ్చింది' అని వైఎస్సార్‌సీపీ కందుకూరు ఎమ్మెల్యే అభ్యర్థి బుర్రా మధుసూదన్ యాదవ్ అన్నారు. స్థానిక 19, 17వ వార్డుల పరిధిలోని పోస్టాఫీస్ సెంటర్, కనిగిరి రోడ్డు, వాసవీ గ్రంథాలయం, పెద్దబజార్, అభ్యుదయ స్కూల్ తదితర ప్రాంతాల్లో మంగళవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు పెద్ద ఎత్తున మేలు చేసిందన్నారు. ప్రతి ఇంటికీ ఏదో ఒక పథకాన్ని అందించిందని గుర్తు చేశారు. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగాలంటే మరోసారి జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం వైఎస్సార్‌సీపీకి వస్తున్న ప్రజాదరణను చూడలేకే ప్రతిపక్షాలు అసత్య ప్రచారాలకు పాల్పడుతున్నాయన్నారు. చంద్రబాబు నాయుడు మోసపూరిత మేనిఫెస్టోను విడుదల చేశారని ఎద్దేవా చేశారు. ఈ సందర్భంగా గ్రామదేవత పోలేరమ్మ తల్లి ఆలయంలో బుర్రా ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు షేక్ రఫీ, ఆర్యవైశ్య నాయకులు, ఆలిండియా వాసవీ సత్ర సముదాయాల అధ్యక్షుడు దేవకి వెంకటేశ్వర్లు, మురారిశెట్టి శ్రీకాంత్, మురారిశెట్టి శ్రీను, మోదడుగు వెంకట నరసింహారావు, కనమర్లపూడి మురళి, కందగడ్ల వెంకటేశ్వర్లు, వేముల రాము, వేముల నరసింహా, వెల్లంపల్లి మస్తానయ్య, పబ్బిశెట్టి సుమన్, చీదెళ్ల మూర్తి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే పేదలకు మేలు


రాపూరులో ప్రచారం

రాపూరు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే పేదలకు మేలు జరిగిందని ఆ పార్టీ తిరుపతి పార్లమెంట్ మైనార్టీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఖాదర్‌బాషా, ఏటూరి మురళీమోహన్‌రెడ్డి తెలిపారు. వారు మంగళవారం రాపూరులో ప్రచారం చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పారదర్శకంగా పథకాలు అందించినట్లు చెప్పారు. వెంకటగిరి ఎమ్మెల్యేగా నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, తిరుపతి ఎంపీగా గురుమూర్తిని గెలిపించాలని కోరారు. నాయకులు పిచ్చిరెడ్డి, వెంకటసుబ్బయ్య, ఆరీఫా, బాబు తదితరులు పాల్గొన్నారు.

• సైదాపురం: మండలంలోని మొలకలపూండ్లలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మన్నారపు రవికుమార్ యాదవ్, మాజీ సర్పంచ్ బండి వెంకటేశ్వర్లురెడ్డి మంగళవారం ప్రచారం చేశారు. కూకటి వెంకటేశ్వర్లు, అడసపల్లి మల్లీశ్వరనాయుడు, బాబు నాయుడు, కూకటి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షల్లో ముగ్గురి డిబార్

వెంకటాచలం: విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ కళాశాలల్లో మంగళవారం జరిగిన డిగ్రీ పరీక్షల్లో ముగ్గురు విద్యార్థులు డిబారైనట్లు వర్సిటీ పరీక్షల నిర్వహణాధికారిణి డాక్టర్ మధుమతి తెలిపారు. ఉదయం నిర్వహించిన ఐదో, ఆరో సెమిస్టర్ పరీక్షలకు 1,374 మంది విద్యార్థులకు గానూ 1,242 మంది హాజరై, 132 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం నిర్వహించిన నాలుగో సెమిస్టర్ పరీక్షకు 8,195 మందికి గానూ 7,643 మంది హాజరై 552 మంది గైర్హాజరయ్యారు.

కావలిని అగ్రగామిగా నిలబెడతాం



విజయసాయిరెడ్డి, ప్రతాప్‌కుమార్‌రెడ్డిలను పైనాపిల్ మాలతో సత్కరిస్తున్న నాయకులు

• నెల్లూరు ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి

కావలి: రానున్న ఐదేళ్లలో కావలి నియోజకవర్గాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలుపుతామని వైఎస్సార్ సీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి వి.విజయసాయిరెడ్డి తెలిపారు. కావలి పట్టణంతోపాటు కావలి మండలం అన్నగారిపాళెం పంచాయతీలో మంగళవారం స్థానిక ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డితో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయసాయిరెడ్డి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి ప్రతిపాదనల మేరకు జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్, రామాయపట్నం పోర్టులను నిర్మించినట్లు తెలిపారు. అలాగే ఎమ్మెల్యే ప్రతిపాదనల మేరకు పరిశ్రమల హబ్‌ను ఏర్పాటు చేసేందుకు అవసరమైన భూసేకరణ కూడా ముగింపు దశకు వచ్చిందని గుర్తు చేశారు. అలాగే దామవరంలో అంతర్జాతీయ విమానాశ్రయంతోపాటు కార్గో (సరుకుల రవాణా) ప్రధాన భూమికగా విమానాశ్రయం నిర్మాణానికి ఎమ్మెల్యే చొరవ తీసుకుంటున్నారని తెలిపారు. మరో ఆరు నెలల్లో రామాయపట్నం పోర్టు, జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌లు అందుబాటులోకి వస్తాయని, మరో రెండేళ్ల కాలంలో పరిశ్రమల హబ్, విమానాశ్రయం పూర్తిస్థాయిలో ప్రజలకు అందుబాటులో వచ్చేలా పటిష్టమైన కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. అలాగే సాగు, తాగునీటి సమస్యలను శాశ్వత ప్రాతిపదికన పరిష్కరించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వీటన్నింటి నెరవేర్చేందుకు మే 13వ తేదీన జరిగే సార్వత్రిక ఎన్నికల్లో కావలి ఎమ్మెల్యేగా రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిని, తనను నెల్లూరు ఎంపీగా గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

ఇలాంటి అవకాశం ఇంకెప్పుడూ రాదు

కావలి నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసుకునేందుకు ఇంతకాన్న అద్భుతమైన అవకాశం ఇంకెప్పుడూ రాదని, ఈ ప్రాంత అభివృద్ధి కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పూర్తిస్థాయిలో సహకరిస్తున్నారని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీ వేణుంబాక విజయసాయిరెడ్డి సహాయ సహకారాలతో కావలి నియోజకవర్గాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేసుకుందామని తెలిపారు. ప్రజలు టీడీపీ నాయకుల మాయమాటలు నమ్మి మోసపోవద్దన్నారు. టీడీపీ నాయకుల ఉత్తుత్తి మాటలను ఆ పార్టీ కార్యకర్తలే నమ్మడం లేదన్నారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, మాజీ ఎమ్మెల్యే కాంటరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి మన్నెమాల సుకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

ప్రతి కుటుంబ ఆర్థికాభివృద్ధే లక్ష్యం

• ఆత్మకూరు ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

మర్రిపాడు: రాష్ట్రంలో ప్రతి కుటుంబ ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలను ప్రజలకు అందించారని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మర్రిపాడు మండలం బ్రాహ్మణపల్లిలోని మేకపాటి నివాసంలో బహుజనుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కుటుంబంలోని పిల్లలు చదువుకునేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమ్మఒడి, జగనన్న విద్యాదీవెన, వసతిదీవెన తదితర పథకాలను అమలు చేశారని, ప్రభుత్వ పాఠశాలలను నాడు–నేడు కార్యక్రమం ద్వారా కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా అభివృద్ధి చేశారని తెలిపారు. తన తండ్రి, మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి విద్యాభివృద్ధి కోసం ఎంతో కృషి చేశారని తెలిపారు. జగనన్న మేనిఫెస్టోపై ప్రజలకు నమ్మకం ఉందని, ఆయన ఇచ్చిన ప్రతి హామీని తప్పక నెరవేరుస్తారని తెలిపారు. ప్రజలకు మంచి చేస్తామనే నమ్మకంతోనే అంబేడ్కర్ ఇండియా మిషన్ సభ్యుడు నందా ఓబులేసు సైతం తమకు మద్దతు తెలిపారన్నారు. మేనిఫెస్టోలో జగనన్న 50 శాతం దళితులు ఉండి, వారి జనాభా 500లకు పైగా ఉన్న వాటిని ప్రత్యేక పంచాయతీలుగా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. రానున్న రోజుల్లో నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామన్నారు. మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకునేలా ప్రజలందరినీ కోరాలని సూచించారు.

ఆయన వెంట జెడ్పీ మాజీ చైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, వైఎస్సార్‌సీపీ మర్రిపాడు మండల కన్వీనర్ బొర్రా సుబ్బిరెడ్డి, మాజీ కన్వీనర్ గంగవరపు శ్రీనివాసులునాయుడు, ఆత్మకూరు పట్టణ అధ్యక్షుడు అల్లారెడ్డి ఆనందరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దేవసహాయం, కొండా వెంకటేశ్వర్లు, అద్దంకి రామకృష్ణ, యర్రగుంట పెంచలయ్య, కొప్పోలు వెంకటేశ్వర్లు, తోడేటి అశోక్, నరసింహులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

సంక్షేమ ప్రభుత్వానికి పట్టం కట్టండి



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

• ఉదయగిరి ఎమ్మెల్యే అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

జలదంకి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలోని ప్రజా సంక్షేమ ప్రభుత్వానికి మరోసారి పట్టం కట్టాలని వైఎస్సార్‌సీపీ ఉదయగిరి ఎమ్మెల్యే అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. మంగళవారం జలదంకి మండలంలోని ఎల్‌ఆర్ అగ్రహారం, చోడవరం, చినక్రాక, వేములపాడు పంచాయతీల్లో ఆయన విజయ సంకల్ప యాత్ర నిర్వహించారు. ఆయా గ్రామాల ప్రజలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు రాజగోపాల్‌రెడ్డికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో విద్య, వైద్య రంగాలకు పెద్దపీట వేశారని, పేదల విద్యార్థులకు నాణ్యమైన విద్య ఉచితంగా అందుతోందని తెలిపారు. అలాగే ప్రతి కుటుంబానికి కార్పొరేట్ వైద్యం ఉచితంగా అందుతున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేనిఫెస్టోను రూపొందించారని తెలిపారు. జగనన్న అమలు చేయగలిగిన హామీలనే ఇస్తారని, పథకాల అమలును పారదర్శకంగా చేపడతారని తెలిపారు. గత ఐదేళ్ల పాలనే ఇందుకు నిదర్శనమన్నారు. మేనిఫెస్టోలో అమ్మఒడి, రైతుభరోసా, వైఎస్సార్ పింఛన్ కానుక, జగనన్న తోడు, చేయూత, నేతన్న నేస్తం తదితర పథకాల లబ్ధిని మరింత పెంచడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతుందన్నారు. అబద్ధపు హామీలు, నెరవేర్చలేని పథకాలతో చంద్రబాబు ఎన్నికలకు వస్తున్నారని, వారి మాయమాటలు నమ్మి మోసపోవద్దని ప్రజలకు సూచించారు. మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో రెండు ఓట్లను ఫ్యాను గుర్తుకు వేసి ఉదయగిరి ఎమ్మెల్యేగా తనను, నెల్లూరు ఎంపీగా వి.విజయసాయిరెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పాలవల్లి మాలకొండారెడ్డి, సొసైటీ చైర్మన్ కేతిరెడ్డి రవీంద్రరెడ్డి, నాయకులు వంటేరు రామచంద్రారెడ్డి, తిప్పారెడ్డి ఇందిరమ్మ, ఇస్కా మదన్‌మోహన్‌రెడ్డి, రావి ప్రసాద్‌నాయుడు, బోడిమండ్ల కృష్ణారెడ్డి, సురె వెంకటశేషారెడ్డి, గుర్రం జగ్గయ్య, గుర్రం ధనుష్‌నాయుడు, పరుసు మాల్యాద్రి, యనమల ప్రసాద్, దారుకుమల్లి రమేష్‌రెడ్డి, వల్లంరెడ్డి నరసారెడ్డి, సురె కృష్ణారెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రెవెన్యూ సిబ్బందిపై చర్యలు తీసుకోండి



మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

మనుబోలు: రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యంతో మనుబోలు మండల కేంద్రంలో పలువురు పౌరులు ఓటు హక్కు కోల్పోయారని, ఇందుకు కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు అనమాల ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో విలేకరులతో మాట్లాడారు. రాజ్యాంగం 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించిందని తెలిపారు. మనుబోలులో గిరిజనకాలనీకి చెందిన ఆవుల హనుమంతయ్య, ఆయన భార్య నాగమ్మ మొదట ఆధార్ కార్డుతో ఓటు నమోదు చేసుకున్నారని తెలిపారు. అది రిజెక్ట్ కావడంతో వీఆర్వో సూచనలతో రేషన్‌కార్డుతో ఓటు నమోదు చేసుకున్నాడని, అది కూడా రిజెక్ట్ అయిందని తెలిపారు. అలాగే గూడూరు పెంచలయ్య అనే పూల వ్యాపారి 40 ఏళ్లుగా స్థానికంగా నివాసం ఉంటున్నాడని, అయితే వారి కుటుంబంలో నలుగురు ఓటు హక్కు కోసం నమోదు చేసుకున్నా రాలేదని తెలిపారు. వీరితోపాటు మనుబోలులో నమోదు చేసుకున్న చాలా మందికి ఓటు హక్కు రాలేదన్నారు. దీనంతటికీ రెవెన్యూ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యమే కారణమని ఆరోపించారు. దీనికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అర్చకుల హక్కులను కాలరాసిన టీడీపీ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జ్వాలాపురం శ్రీకాంత్‌శర్మ, బ్రాహ్మణ సంఘం నాయకులు

• ప్రభుత్వ సలహాదారుడు జ్వాలాపురం శ్రీకాంత్‌శర్మ

నెల్లూరు(దర్గామిట్ట): తెలుగుదేశం పార్టీ రాష్ట్రంలో కరణీకం వ్యవస్థను తొలగించి బ్రాహ్మణులకు వెన్నుపోటు పొడిచిందని, అర్చకుల హక్కులను కాలరాసిందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు జ్వాలాపురం శ్రీకాంత్‌శర్మ అన్నారు. నెల్లూరులోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా ఉన్న ఆలయాల్లో అర్చకుల వంశ పారంపర్య హక్కులు తొలగించి బ్రాహ్మణులను రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా టీడీపీ నష్టపరిచిందన్నారు. దాదాపు 16 వేల మంది అర్చకులకు ధూప దీప నైవేద్యం పథకం అందజేసిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కిందని తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పలువురికి చట్టసభల్లో స్థానం కల్పించి బ్రాహ్మణులను అభివృద్ధికి కృషి చేశారని తెలిపారు. బ్రాహ్మణులంతా వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించి మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బ్రాహ్మణ నేతలు మంగళంపల్లి అంజిబాబు, జిల్లా బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు మువ్వ ప్రసాద్, ఎన్‌వీ రమణకుమార్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ సంఘీయులు ఆశీర్వదించాలి

నెల్లూరు(బృందావనం): బ్రాహ్మణ సంఘీయులందరూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఓటు వేసి ఆయన మళ్లీ ముఖ్యమంత్రి అయ్యేలా ఆశీర్వదించాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు జ్వాలాపురం శ్రీకాంత్‌శర్మ కోరారు. నగరంలోని 14వ డివిజన్‌లో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి, ఆ డివిజన్ కార్పొరేటర్ కర్తం ప్రతాప్‌రెడ్డితో కలిసి మంగళవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బ్రాహ్మణ సంఘీయుల సంక్షేమానికి చేసిన సేవలను కొనియాడారు. బ్రాహ్మణులు మరింత అభివృద్ధి చెందాలంటే నెల్లూరు ఎంపీగా వేణుంబాక విజయసాయిరెడ్డిని, నెల్లూరు నగర ఎమ్మెల్యేగా ఖలీల్‌అహ్మద్‌ని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు మువ్వా ప్రసాద్, నేతలు వైవీ రమణకుమార్, జంగా శ్రీను, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

50 టీడీపీ కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరిక



పార్టీలో చేరిన వారితో ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు సిటీ: నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని 25వ డివిజన్‌లో టీడీపీకి చెందిన 50 కుటుంబాలు వైఎస్సార్‌సీపీ రూరల్ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. నగరంలోని మినీబైపాస్‌లో ఉన్న ఆదాల కార్యాలయంలో మంగళవారం వారు పార్టీలో చేరగా, ఆదాల వారికి వైఎస్సార్‌సీపీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. బుజబుజ నెల్లూరు ప్రాంతానికి చెందిన షేక్ రజియా, పార్వతమ్మ, అమృత, అరుణ ఆధ్వర్యంలో పలువురు పార్టీలో చేరారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు మలిరెడ్డి కోటారెడ్డి, ఏఎంసీ చైర్మన్ కోటేశ్వరరెడ్డి, ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు బద్దెపూడి రవీంద్ర, ఎంపీటీసీ మాజీ సభ్యుడు షేక్ ఖాదర్‌బాషా, స్వర్ణా వెంకయ్య, ఏడుకొండలు, రాజు, అమీర్, బెల్లంకొండ వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన

ముత్తుకూరు: జాతీయ అగ్నిమాపక పక్షోత్సవాల ముగింపు సందర్భంగా మండలంలోని పైనాపురంలో ఉన్న ఎస్ఈఐఎల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ కంపెనీలో మంగళవారం అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. అగ్నిమాపక దళం మాక్‌డ్రిల్ ప్రదర్శించింది. కార్యక్రమంలో కంపెనీ సీఈఓ రాఘవత్రివేది, కంపెనీ ఓఅండ్ఎం హెడ్ సునీల్‌గుప్తా పాల్గొన్నారు.

చంద్రబాబును ప్రజలు విశ్వసించరు

• కర్నూలు ఎమ్మెల్యే ఎంఏ హఫీజ్‌ఖాన్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఏ హఫీజ్ ఖాన్

నెల్లూరు(దర్గామిట్ట): 2014 ఎన్నికల్లో 600 హామీలిచ్చి గద్దెనెక్కిన చంద్రబాబు వాటిలో ఆరు హామీలను కూడా అమలు చేయలేదని, అబద్ధాల కోరు చంద్రబాబును ప్రజలు విశ్వసించరని కర్నూలు ఎమ్మెల్యే ఎంఏ హఫీజ్ ఖాన్ దుయ్యబట్టారు. నగరంలోని మాగుంట లేఅవుట్‌లో ఉన్న వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, నెల్లూరు సిటీ అభ్యర్థి ఖలీల్‌అహ్మద్‌లతో కలిసి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు నిరుద్యోగులను, మహిళలను, రైతులను మోసం చేసి గద్దెనెక్కారని, గత ప్రభుత్వంలో పొంగూరు నారాయణ రూ.వందల కోట్లు చంద్రబాబుకు ముట్టచెప్పి దొడ్డిదారిన మంత్రి అయ్యారని విమర్శించారు. రాష్ట్రంలో ప్రతి పేద కుటుంబం అభివృద్ధి చెందాలనే ఆకాంక్షతో సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను తీసుకువచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను పేదల ఇంటి ముంగిటకే చేర్చారని తెలిపారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లు కల్పించారని, ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మైనారిటీలకు అండగా నిలుస్తున్నారని తెలిపారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కులమతాలకు అతీతంగా, పారదర్శకంగా సంక్షేమ పథకాలను అమలు చేశారని తెలిపారు. రాష్ట్రంలో కులాలు, మతాల మధ్య చిచ్చుపెట్టాలని చంద్రబాబు చూస్తున్నారని ఆరోపించారు. టీడీపీలో నెల్లూరురూరల్ ఇన్‌చార్జిగా ఉన్న అజీజ్‌కు ఎందుకు టికెట్ ఇవ్వలేదో చెప్పాలని ప్రశ్నించారు. ముస్లింలను మోసం చేయడం చంద్రబాబు నైజమన్నారు. సామాన్యుడు ఖలీల్‌అహ్మద్‌కు నెల్లూరు సిటీ అభ్యర్థిగా సీటు ఇచ్చి ముస్లింలను గౌరవించిన ఘనత వైఎస్సార్‌సీపీదేనని తెలిపారు. నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థిగా విజయసాయిరెడ్డితోపాటు ఏడు అసెంబ్లీ స్థానాలు జిల్లాలో వైఎస్సార్‌సీపీ క్లీన్ స్వీప్ చేయడం ఖాయమన్నారు. రాష్ట్రంలో పరిశ్రమల స్థాపన, ఉద్యోగ కల్పన, సంక్షేమం, అభివృద్ధి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమైందన్నారు.

మద్యం, నగదు అక్రమ రవాణా కట్టడికి చర్యలు

• కొనసాగుతున్న తనిఖీలు

నెల్లూరు(క్రైమ్): ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో మద్యం, నగదు అక్రమ రవాణాను పూర్తిస్థాయిలో కట్టడి చేసేందుకు జిల్లా పోలీసు యంత్రాంగం తనిఖీలు ముమ్మరం చేసింది. అందులో భాగంగా సోమవారం రాత్రి, మంగళవారం కందుకూరు రూరల్ పరిధిలో రూ.7.50 లక్షలు, ఉలవపాడు పరిధిలో రూ.లక్ష నగదు ఎలాంటి పత్రాలు లేకుండా తరలిస్తుండగా పోలీసు అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కలువాయిలో 20, ఉదయగిరిలో 9, కావలి రూరల్‌లో 10, ఎస్ఈబీ అధికారులు 154 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. కావలి రూరల్‌లో 900 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో తనిఖీలు ముమ్మరం చేయాలని, ప్రతి వాహనాన్నీ క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ సిబ్బందిని ఆదేశించారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘనులపై కేసులు నమోదు చేయాలని తెలిపారు.

అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలి

• ప్రత్యేక వ్యయ పరిశీలకులు నీనానిగమ్




మాట్లాడుతున్న నీనానిగమ్

నెల్లూరు(బారకాసు): సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా పోలింగ్ ప్రక్రియ ముగిసే వరకు ఎక్స్‌పెండిచర్ బృందాలు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని ప్రత్యేక వ్యయ పరిశీలకులు నీనానిగమ్ సూచించారు. మంగళవారం నగరంలోని కార్పొరేషన్ కార్యాలయంలో ఉన్న కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరినారాయణన్, కేంద్ర ఎన్నికల పరిశీలకులతో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికలు పూర్తయ్యే వరకు అన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ టీంలు నిరంతరం నిఘా పెట్టి పనిచేయాలన్నారు. చట్టపరంగా చేసే ఖర్చులు అభ్యర్థుల ఖాతాలోకి వస్తాయని, చట్టవ్యతిరేకంగా నిర్వహిస్తున్న మద్యం, నగదు, వస్తు పంపిణీ సీజ్ చేసి అరికట్టాలని సూచించారు. ఉచితాల పంపిణీ, యూపీఐ పేమెంట్స్, మెటీరియల్ డిస్ట్రిబ్యూషన్‌పై ప్రత్యేక నిఘా పెట్టి అప్రమత్తంగా పనిచేయాలన్నారు. తొలుత జిల్లాలో జరగనున్న ఎన్నికలకు చేసిన ఏర్పాట్లను, జిల్లా భౌగోళిక పరిస్థితిని కలెక్టర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. సమావేశంలో ఎన్నికల వ్యయ పరిశీలకులు జ్యోతి మోయ్ బైలంగ్, కంచన్‌రమామ్ మీనా, ప్రసాద్ దత్తాత్రేయ, ఎస్పీ ఆరిఫ్‌హఫీజ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఈతకు వెళ్లి అన్నదమ్ముల గల్లంతు

• ఇద్దరి మృతదేహాలు లభ్యం



వంశీకృష్ణ, నరసింహులు(ఫైల్)



వంశీ కృష్ణ మృతదేహం

సోమశిల: అన్నదమ్ముల ఈత సరదా ఓ కుటుంబంలో విషాదం నింపింది. స్నేహితులతో కలిసి ఈతకు వెళ్లిన ఇద్దరు సోదరులు ఉప్పలపాడు హైవే వద్ద పెన్నా నదిలో గల్లంతై మృతిచెందిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు అనంతసాగరం మండలం పాతాళపల్లి గ్రామానికి చెందిన మిట్టమల్ల చిన్నవెంకటయ్య కుమారులు వంశీకృష్ణ(25), నరసింహ (23) తమ మిత్రులతో కలిసి హైవే వద్ద పెన్నా నదిలో ఈతకు వెళ్లారు. ముందుగా నీటిలో మునిగిన నరసింహ ఎంతకూ బయటకు రాకపోవడంతో అతని కోసం వెళ్లిన వంశీకృష్ణ కూడా గల్లంతయ్యాడు. ఈ క్రమంలో వారి కోసం మిత్రులు గాలించగా వంశీకృష్ణ దొరకడంతో అతనిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించేందుకు ప్రయత్నించగా అప్పటికే మృతిచెందాడు. చీకటి పడడంతో గాలింపు చర్యలకు ఆటంకం ఏర్పడింది. సోమశిల నుంచి గజ ఈతగాళ్లను పిలిపించి లైట్ల వెలుతురులో గాలింపు చర్యలు చేపట్టినట్లు ఆత్మకూరు సీఐ జి.వేణు తెలిపారు. అనంతరం నరసింహ మృతదేహం కూడా లభ్యమైంది. సోమశిల ఎస్సై సుబ్బారావు కేసును దర్యాప్తు చేస్తున్నారు. సరదాగా ఈతకు వెళ్లిన ఇద్దరు కుమారులు మృతిచెందడంతో వారి కుటుంబం కన్నీటిపర్యంతమైంది. పాతాళపల్లి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. గాలింపు చర్యల్లో ఆత్మకూరు ఎస్సై ముత్యాలరావు, కలువాయి ఎస్సై అయ్యప్ప ఉన్నారు.

రెక్కలు ముక్కలు

రెక్కలు ముక్కలు చేసుకుని పనులు చేసే కార్మికుల భద్రతపై ఆయా పరిశ్రమల యాజమాన్యాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయి.. కనీసం వారికి ఈఎస్ఐ, పీఎఫ్ కూడా చెల్లించడం లేదు. తాము పనిచేసే చోట ప్రమాదవశాత్తు మరణించినా ఆ విషయం బయటికి చెప్పొద్దంటూ తోటి కార్మికులను ఆయా పరిశ్రమల యాజమాన్యాలు వేధింపులకు గురిచేస్తున్నాయి. ముఖ్యంగా రైస్ మిల్లుల్లో కార్మికుల పరిస్థితి దయనీయంగా ఉంది.

- రైస్ మిల్లుల్లో నలుగుతున్న కార్మికుల ప్రాణాలు
- ఈఎస్ఐ, పీఎఫ్ చెల్లించని యాజమాన్యాలు
- కార్మికులు మృతిచెందినా పట్టించుకోని దుస్థితి
- రోడ్డున పడుతున్న కుటుంబాలు



ప్రమాదం జరిగిన రైస్ మిల్లుల్లో కార్మికులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న కార్మిక సంఘం నాయకుడు (ఫైల్)

నెల్లూరు(పొగతోట): రైస్ మిల్లుల్లో పనిచేస్తున్న కార్మికుల జీవితాలకు భద్రత లేకుండా పోయింది. వారు పనిచేసే చోట ప్రమాదం జరిగి తోటి కార్మికుడు మరణించినా బయటకు చెప్పుకోలేని పరిస్థితి. కార్మికులు నోరివిప్పితే వారిపై యాజమాన్యాలు బెదిరింపులకు దిగుతుండడంతో ఏమీ చెప్పలేక మిన్నకుండిపోతున్నారు. నోరువిప్పితే యాజమాన్యాలు తమపై కక్షకట్టి పనులు లేకుండా చేస్తున్నాయని కార్మికులు వాపోతున్నారు. దీంతో బాధిత కార్మికుల కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. రైస్ మిల్లుల యాజమాన్యాలు కార్మికులకు కనీసం ఈఎస్ఐ, పీఎఫ్ కూడా చెల్లించడం లేదని తెలుస్తోంది.

ఏళ్ల తరబడి పనిచేస్తున్నా..!

నెల్లూరు బియ్యానికి దేశవ్యాప్తంగా మంచి పేరు, డిమాండ్ ఉంది. జిల్లాలో అధిక శాతం మంది రైతులు వరి పంటను సాగు చేస్తారు. సంవత్సరానికి రెండు పంటలు పండిస్తారు. రెండు విడతల్లో సుమారు 10 లక్షల ఎకరాల్లో వరి పంట సాగు చేస్తున్నారు. ధాన్యం దిగుబడి అధికంగా వస్తుండడంతో జిల్లాలో రైస్ మిల్లులు కూడా ఆ మేరకు ఏర్పాటయ్యాయి. సీఎంఆర్ ప్రకారం 117 రైస్ మిల్లులు, దానితో సంబంధం లేకుండా 100కుపైగా మిల్లులు ఉన్నాయి. మొత్తమ్మీద జిల్లావ్యాప్తంగా చిన్న, పెద్ద రైస్ మిల్లులు 220 వరకు ఉన్నట్లు సమాచారం. ఈ రైస్ మిల్లుల్లో వేలాది మంది కార్మికులు పనిచేస్తున్నారు. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలు, బిహార్ తదితర రాష్ట్రాల నుంచి కార్మికులు వచ్చి రైస్ మిల్లుల్లో పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. రైస్ మిల్లుల్లో పనిచేసే కార్మికుల కోసం వాటి యాజమాన్యాలు అక్కడే చిన్న చిన్న గదులను ఏర్పాటు చేయడంతో వారు వాటిలోనే నివాసం ఉంటున్నారు. యాజమాన్యాలు కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్ చెల్లించాలని కార్మిక చట్టాలు చెబుతున్నప్పటికీ అతి తక్కువ మంది కార్మికులకు మాత్రమే చెల్లిస్తున్నట్లు తెలుస్తోంది. మిగిలిన కార్మికులు ఏళ్ల తరబడి పనిచేస్తున్నా వారికి ఈఎస్ఐ, పీఎఫ్ చెల్లించడం లేదు. కార్మికులు రైస్ మిల్లుల్లో పనిచేస్తున్నప్పుడు ప్రమాదాలు సంభవించి దెబ్బలు తగలడం, మరణించడం జరుగుతోంది. అలాంటి పరిస్థితుల్లో యాజమాన్యాలు పట్టించుకోకపోవడంతో బాధిత కార్మికుల కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి.

మరణించినా దిక్కెవరు..?

ఇటీవల నెల్లూరు సమీపంలోని రాజుపాళెంలో ఉన్న రైస్ మిల్లులో ఇద్దరు కార్మికులు ప్రమాదవశాత్తు మరణించారు. ఒకరు బూడిదలో పడి మృతిచెందగా.. మరొకరు లారీలో నుంచి ధాన్యం బస్తాలు దింపుతూ బస్తాలు పైన పడి ఆస్పత్రిలో చికిత్సపొందుతూ మరణించాడు. ఆ రైస్ మిల్లు యాజమాన్యం ఆస్పత్రి ఖర్చులకు కేవలం రూ.10 వేలు ఇచ్చి చేతులు దులుపుకుంది. దీంతో బాధిత కుటుంబం మృతదేహాన్ని శ్రీకాకుళం తీసుకెళ్లడానికి నానా అవస్థలు పడింది. ఇలాంటి ఘటనలు తరచూ చోటుచేసుకుంటున్నాయి. కార్మిక సంఘాల నాయకులు ప్రమాదం జరిగిన ప్రాంతాలకు వెళ్లి విచారించినా బాధిత కుటుంబాలకు న్యాయం జరగడం లేదు. తోటి కార్మికులు కూడా యాజమాన్యాల బెదిరింపులతో ఈ ప్రమాదాల గురించి బయటకు చెప్పలేక వెనుకడుగు వేస్తున్నారు. అధికారుల ఈ అంశాలపై పట్టించుకోకపోవడంతో కార్మికుల కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. ఇకనైనా ఇలాంటి ఘటనలపై చర్యలు తీసుకుని కార్మికుల కుటుంబాలను ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అండగా ఉంటాం



రైస్ మిల్లుల్లో పనిచేస్తున్న కార్మికుల జీవితాలకు భద్రత కల్పించాల్సిన బాధ్యత యాజమాన్యాలపై ఉంది. ఇటీవల ప్రమాదాలు సంభవించి ఇద్దరు కార్మికులు మరణించారు. నామమాత్రపు చర్యలతో యాజమాన్యాలు చేతులు దులుపుకున్నాయి. కార్మికుల సమస్యలపై పోరాటం చేసి వారికి అండగా నిలుస్తాం.

– ఎండీ అబ్దుల్‌అజీజ్, కార్మిక సంఘం నాయకుడు

ఈఎస్ఐ, పీఎఫ్ చెల్లించాలి

రైస్ మిల్లుల్లో పనిచేస్తున్న కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్ కచ్చితంగా చెల్లించాలి. ప్రతి సంవత్సరం రెన్యువల్ చేయించాలి. తద్వారా ప్రమాదాలు జరిగినప్పుడు కార్మికులకు వైద్యసేవలు అందుతాయి. రైస్ మిల్లుల్లో ప్రమాదాలు జరిగి కార్మికులు మరణించిన ఘటనలపై విచారించి చర్యలు తీసుకుంటాం.

– వెంకటేశ్వరరావు, డిప్యూటీ కమిషనర్, కార్మికశాఖ